క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం



గౌస్‌కు నగదు అందజేస్తున్న ఫారూఖీ, బర్కత్ అలీ

మద్రిపాలెం: ఇటీవల జగదాంబ జంక్షన్ సమీపంలోని గౌస్ అనే వ్యక్తి ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఆ కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. దీంతో బుధవారం బాధితుడిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ ఐ.హెచ్.ఫారూఖీ, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. వారికి తామున్నామని భరోసా ఇచ్చారు.

యువకుడి అరెస్ట్

సీతమ్మధార: బాలిక అదృశ్యం కేసులో యువకుడు గనివాడ గణేష్‌ను ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం శ్రీనివాస్ నగర్‌కు చెందిన ఓ బాలిక ఈ నెల 1న బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా కనిపించకపోవడంతో ఈ నెల 3న బాలిక తండ్రి సంజయ్‌సాట్ ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ శ్రీనివాసరావు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దొండపర్తి కుమ్మర వీధికి చెందిన గణేష్ అనే యువకుడు ఆ బాలికను తీసుకెళ్లినట్లు గుర్తించారు. దొండపర్తిలో బుధవారం యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొలువుదీరిన ఓం వాకర్స్ క్లబ్ కార్యవర్గం

మురళీనగర్: మురళీనగర్ ఓం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం బుధవారం కొలువుదీరింది. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వనితా భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర సమక్షంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. అధ్యక్షురాలిగా వి.ప్రమీల, ఉపాధ్యక్షులుగా ఎస్.అప్పారావు, పి.గిరిధర్, కార్యదర్శిగా పి.పుష్ప, ఉప కార్యదర్శిగా పి.సతీష్, కోశాధికారిగా ఎ.రవణమ్మ, జాలీవాకర్‌గా బి.వెంకటేశ్వరరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎస్.నాగేశ్వరరావు, కళావతి, పూజిత, జ్యోతి ప్రమాణం చేశారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఆర్‌సీ ఎ.లక్ష్మీరెడ్డి, సెక్రటరీ ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, క్యాబినెట్ సెక్రటరీ జ్యోతి పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కు ప్రారంభం



అల్లూరి చిల్డ్రన్ పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని అల్లూరి సీతారామరాజు చిల్డ్రన్ కాలనీ పార్కును బుధవారం కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.6 లక్షలతో పార్కు మరమ్మతులు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని పిల్లలు, విద్యార్థులు, స్థానికులకు అనుకూలంగా వాకింగ్, ఆటలాడుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పి.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాసనాయుడు, యు.వి.ఎస్.శివకుమార్, శ్రీనివాసరాజు, ఏఈ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి 56వ వార్డు దుర్గానగర్ సచివాలయంలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై ఎస్ఐ సమీర్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సైబర్ నేరాలు జరగకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన వివరించారు. లోన్ యాప్స్‌తో జాగ్రత్త ఉండాలని సూచించారు. దిశ యాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

సంక్రాంతి సందడి

- పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంబరాలు
- సంప్రదాయ వస్త్రధారణల్లో అలరించిన చిన్నారులు



మురళీనగర్ పాఠశాలలో సంప్రదాయ వస్త్రధారణల్లో అలరిస్తున్న విద్యార్థులు



మధురానగర్ జీవీఎంసీ స్కూల్‌లో భోగి మంట వద్ద కోలాటమాడుతున్న విద్యార్థులు

సీతంపేట: సమైక్య భావాన్ని చాటిచెప్పే సంక్రాంతి పండగ విశిష్టతను పిల్లలకు కళ్లకు కట్టినట్టు చూపారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సందడి చేశారు. మధురానగర్ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలు, పిల్లలకు భోగి పండ్లు, భోగి మంటలు, పొంగలి, సంప్రదాయ వంటకాలు ఇలా ప్రతి అంశాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్సులు, కోలాటం, సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం బి.దేముడుబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట సాయివిజ్ఞాన్ స్కూల్‌లో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు భోగిమంటలు, రంగవల్లులు వేసి ఆట పాటలతో అలరించారు. ముఖ్య అతిథి కనకమహాలక్ష్మి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు సానబోయిన సురేష్ సంక్రాంతి విశిష్టతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సానబోయిన శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లలితకుమారి పాల్గొన్నారు.

వాగ్దేవి స్కూల్‌లో..

అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి.స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ విశిష్టతను, గంగిరెద్దు, హరిదాసుల గొప్పతనాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన చిన్నారులు..

కంచరపాలెం: కంచరపాలెంలోని చైతన్య గిరీషా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మేనేజ్‌మెంట్, డైరెక్టర్ జోగి సోమశేఖరరావు, ప్రిన్సిపాల్ అనురాధ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు కార్పొరేటర్ శశికళ ప్రారంభించారు. డూడు బసవన్నలు, గంగిరెద్దులు, పులి, పిట్టలదొర మొదలగు వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి వరలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వాగ్దేవి స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో గంగిరెద్దు సందడి

ఆడిపాడిన విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ రవీంద్ర భారతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులతో స్కూల్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు వేసి సంక్రాంతి పాటలు పాడారు. భోగిమంటలు వేసి సందడి చేశారు. విద్యార్థులు తెలుగు సంప్రదాయ వేషధారణలు, కళాకారుల వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముచ్చటైన ముగ్గులు.. భోగి మంటలు

మురళీనగర్: ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ముగ్గులు వేసి సందడి చేశారు. భోగిమంటలు వేసి సంప్రదాయ గీతాలను ఆలపించారు. హెచ్‌ఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పూర్వ హెచ్‌ఎం ఏఎస్‌నాయుడు ప్రసంగించారు. వ్యాయామ ఉపాధ్యాయిని స్వరూప, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మీనాకుమారి, కిరణ్ కుమార్, త్రినాథ్, రమణమూర్తి, ప్రశాంతి, లక్ష్మి, నిర్మల, సీఆర్‌పీ ఆర్.పద్మ పాల్గొన్నారు.



సీతపేటలో సంక్రాంతి సంబరాలు



కె.కాలనీ పాఠశాలలో భోగి మంట వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు



కంచరపాలెం సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అతిథులు

ప్రజలందరి సంక్షేమమే సీఎం లక్ష్యం



మహిళకు పథకాల లబ్ధిని వివరించి నమస్కరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు పెదకొత్తూరు, జగ్జీవన్ నగర్ సచివాలయాల పరిధిలో బుధవారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కోరారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి అని అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని.. నేడు విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదోడికి అందేలా పరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు కె.పి.రత్నాకర్, రాయుడు శ్రీను, వార్డు నాయకులు విజయ్, అప్పారావు, రాఘవులు, గురువోజీ, చందురెడ్డి, కనకరాజు, భోగేశ్వరరావు, జయకుమార్, రమేష్, హరి, సాగర్‌కిషోర్, భరత్‌సింగ్, జీవీఎంసీ, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి టన్నెల్ అక్వేరియం ప్రదర్శన

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుకనున్న ఏయూ మైదానంలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియంతో పాటు హ్యాండ్‌లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు రాజారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఎగ్జిబిషన్ వేదికగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

‘ఉత్తర’కు పండగొచ్చింది



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న కె.కె.రాజు, కటుమూరి సతీష్, చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్లు, ఇతర నాయకులు

- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు
- ముగ్గుల పోటీల్లో మహిళల ప్రతిభ

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కార్యాలయం పార్టీ శ్రేణులతో సందడిగా మారింది. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు భోగి మంటలు వెలగించి పార్టీ శ్రేణుల్లో పండగ జోష్ నింపారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. వారు వేసిన వివిధ రకాల రంగువల్లులను కె.కె.రాజు పరిశీలించారు. పోటీల్లో మొదటి బహుమతిని తనూజ, రెండో బహుమతిని ఎస్.పార్వతి, మూడో బహుమతిని కె.రమణమ్మ గెలుచుకున్నారు. విజేతలకు కె.కెరాజు చేతుల మీదగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, శశికళ, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు, మాజీ కార్పొరేటర్లు బాక్సర్ రాజు, కిరణ్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, రత్నాకర్, డి.శ్రీనివాస్, పోతు సత్యనారాయణ, బులుసు జగదీష్, సీనియర్ నాయకులు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొదటి బహుమతి గెలుచుకున్న ముగ్గు వద్ద కె.కె.రాజు



ముగ్గుల పోటీల విజేతలతో కె.కె.రాజు

ఆధ్యాత్మికం

వైభవుడికి కూడారై ప్రసాదం సమర్పణ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవుడికి ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కూడారై ప్రసాదం సమర్పించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి 27వ పాశురం వినిపించారు. కుండలో వివిధ సుగంధ ద్రవ్యాలు, పోషకల విలువలు కలిగిన కూడారై ప్రసాదం స్వామికి నివేదించారు. సంపూర్ణ సేవా దాతలు, ధనుర్మాస నెలవారి ప్రసాద సేవా దాతలు, రోజువారి ప్రసాదం దాతల్లో కొందరిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ప్రసాదాన్ని అందించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కూడారై ప్రసాదం విశిష్టతను వివరిస్తున్న అర్చకుడు శేషాచార్యులు

వైభవంగా గోదాదేవి కల్యాణం

సీతమ్మధార: ధనుర్మాసం పూర్తయిన సందర్భంగా బుధవారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో బుధవారం గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణం జరిపారు. ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు



మురళీనగర్: మాధవధారలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులకు బుధవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. సుమారు 50 మంది మహిళలు పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దడంలో తమ సృజనాత్మకతను చాటారు. పల్లె ల్లో సంక్రాంతి శోభను ప్రతిబింబిస్తూ వీరు తీర్చిదిద్దిన ముగ్గులు ముగ్ధమనోహరంగా అలరించాయి. వుమన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు టి.సుమతి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆర్.ప్రవీణ, బి.స్వాతి ప్రథమ, ఇ.ధనలక్ష్మి, ఎస్.హేమ ద్వితీయ, కె.విశాలాక్షి, నీహారిక తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, కోశాధికారి సీహెచ్ లక్ష్మి, జాలీవాకర్ ఎ.మాధవీలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌ల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నేడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ 2023 సంవత్సరానికి ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం వాకర్స్ పార్కులో గురువారం సాయంత్రం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఇదే వేదికపై మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. సభ్యులందరూ హాజరవ్వాలని ఆయన కోరారు.

జైభారత్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం జైభారత్‌నగర్‌లో అభివృద్ధి పనులకు బుధవారం కార్పొరేటర్ గంకల కవిత శంకుస్థాపన చేశారు. సుమారు రూ.10 లక్షలతో కాలువలపై శ్లాబ్ పనులకు భూమిపూజ చేసినట్లు ఆమె తెలిపారు. ఇటీవల వార్డు పర్యటనలో జైభారత్‌నగర్‌లో సమస్యలను గుర్తించామని, వాటి మరమ్మతుల నిమిత్తం మేయర్ గొలగాని హరివెంకటకుమారి దృష్టికి తీసుకెళ్లడంతో జీవీఎంసీ నిధులు మంజూరు చేశారని చెప్పారు. కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు పూర్తి సహాయం అందించాలని కవిత కోరారు. కార్యక్రమంలో జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు డీఈ భరణికుమార్, ఏఈ అర్చన, వార్డు సీనియర్ నాయకుడు గంకల అప్పారావు, మహేష్, శకుంతల, కాంట్రాక్టర్ ధర్మాల ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన భేష్

కంచరపాలెం: కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులోని డాక్టర్ రామారావు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెడికవర్ హాస్పిటల్స్ సంయుక్తంగా గైనకాలజిస్ట్ డాక్టర్ శేషకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 260 మంది స్థానికులు వైద్య సేవలు పొందారు. బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధులు, చెవి, గొంతు, ముక్కుకు సంబంధించిన పరీక్షలు చేసి సూచనలిచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషకుమారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య సమస్యలుంటే తక్షణమే వైద్య సేవలు పొందాలని సూచించారు. పలు వ్యాధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శేషకుమారి

దొంగతనాలపై అప్రమత్తం

- సంక్రాంతి వేళ.. పోలీసుల అవగాహన కార్యక్రమాలు

మద్రిపాలెం: సంక్రాంతి పండగ వేళ.. దొంగతనాలు జరిగే అవకాశముండటంతో ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊర్వశి జంక్షన్ వద్ద గల గౌరీ డిగ్రీ కాలేజీలో క్రైం ఏసీపీ పెంటారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇళ్లలో దొంగతనాలు ఎలా జరుగుతాయో అన్న విషయంపై అవగాహన కల్పించారు. సంక్రాంతికి ప్రజలు సొంతూళ్లకు వెళ్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయన్న నేపథ్యంలో ఇంటిని, ఇంట్లో విలువైన వస్తువులను ఎలా భద్రపరచుకోవాలో వివరించారు. ఊళ్లకు వెళ్లేవారు ముందుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే నిఘా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఊర్లెళ్లే ముందు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్టు గుర్తిస్తే 100కు డయల్ చేయాలని చెప్పారు. వాహనాల దొంగతనాలు కూడా ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని, వాటిని కూడా జాగ్రత్తగా ఉంకోవాలని సూచించారు. రోడ్డుపై ఒంటరిగా వెళ్లేటప్పుడు గొలుసు దొంగతనాలు జరుగుతాయని, గుర్తు తెలియని వ్యక్తులు దృష్టి మళ్లించే విధంగా దొంగతనాలకు పాల్పడతారని, అలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలు వహించాలని ఏసీపీ పెంటారావు సూచించారు. నేటి రోజుల్లో ఆన్‌లైన్‌లో పలు మోసాలు జరుగుతున్నాయని, వాటి జోలికి వెళ్లి మోసపోవద్దని చెప్పారు. కంచరపాలెం క్రైం ఎస్ఐ సునీల్, ఎయిర్‌పోర్టు క్రైం ఎస్ఐ డి.కాంతారావు, గోపాలపట్నం క్రైం ఎస్ఐ ఎస్.నరసింగరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఏసీపీ పెంటారావు

ఊరెళ్తే.. జాగ్రత్త!



ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ద్వారకా క్రైం సీఐ రమణమూర్తి

సీతమ్మధార: సంక్రాంతి పండగ వేళ.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ద్వారకా జోన్ క్రైం సీఐ రమణమూర్తి సూచించారు. సీతంపేటతోపాటు దొంగతనాలను నియంత్రించేందుకు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సెలవులకు ఊర్లెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, బంగారు నగలు, నగదు బ్యాంకులో దాచుకోవాలన్నారు. ఊర్లెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. క్రైం ఎస్ఐ నిహార్ , సిబ్బంది పాల్గొన్నారు.